సాక్షి సంగారెడ్డి

గురువారం । 9 । మార్చి । 2023



హోలీ సంబరాల్లో విషాదం

హోలీ సంబరాలు జరుపుకొని స్నానం చేసేందుకు వెళ్లిన యువకులు గల్లంతయ్యారు. ఈ ఘటన బొల్లారం పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది.

8లో



కిడ్నీ బాధితులకు ఊరట

8లో

జిల్లాలోని ప్రధాన ఆస్పత్రుల్లో ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తుండటంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉపశమనం పొందుతున్నారు.



ఘనంగా మహిళా దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులను సన్మానించారు.

9లో

న్యూస్‌రీల్

'దర్గా స్థలాన్ని సర్వే చేయొద్దు'



వినతిపత్రం అందిస్తున్న ముస్లింలు

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని బైపాస్‌రోడ్డు సమీపంలో ఉన్న తకియా - అల్లాదేవస్(ముభేరి హీరాదర్గా) దర్గా, ముస్లీం శ్మశానవాటిక స్థలాన్ని సర్వే చేయొద్దంటూ బుధవారం ఖేడ్ జమియాత్ - ఉల్ - ఖురేషి ట్రస్ట్ ఆధ్వర్యంలో ముస్లింలు ఆర్డీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దర్గాకు సంబంధించి 3.02 ఎకరాల భూమి ఉందని తెలిపారు. సర్వే నంబర్‌లో వ్యవసాయ భూమి లేకపోగా ఓ మహిళ బోగస్ పత్రాలు సృష్టించి 0.23 ఎకరాల భూమికి పట్టాదారు పాసుపుస్తకం పొందారని పేర్కొన్నారు. అక్కడ వ్యవసాయ భూమి లేదని, దర్గా, శ్మశానవాటిక, ఇళ్లు, ఖాళీ స్థలాలు ఉన్నాయని చెప్పారు. సర్వే కోసం సదరు మహిళ దరఖాస్తు చేసుకున్నారని, సర్వే నిర్వహిస్తే ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున దరఖాస్తును తిరస్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ట్రస్ట్ అధ్యక్షుడు యాదుల్ ఖురేషి ఉన్నారు.

భగవన్నామ స్మరణతోనే మనశ్శాంతి

సదాశివపేట(సంగారెడ్డి): భగవన్నామ స్మరణతోనే మనశ్శాంతి లభిస్తుందని తోగుట పీఠాధిపతి మాధవానందసరస్వతీ స్వామి అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీసంగమేశ్వర మందిరంలో శివలింగానికి అభిషేకం, బిల్వార్చన నిర్వహించారు. వటువు ఈశాన్ సాయి ఉపనయనం, ఆలయ పూజారి జి. మోహన్‌రావు మాధవనందసరస్వతీ స్వామికి పాదపూజ నిర్వహించారు. కౌన్సిలర్ ఆకుల శివకుమార్, మారేపల్లి శివకుమార్, మల్లేశం, సుధాకర్, ప్రభు, రాచన్నస్వామి పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లకు దరఖాస్తు చేసుకోండి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం చిట్కుల్, ముత్తంగి గ్రామాల్లో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి కావస్తున్న నేపథ్యంలో అర్హులైన పేదలకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిట్కుల్‌లో 48, ముత్తంగిలో 96, మొత్తం కలిపి 144 ఇళ్లకు సంబంధించి మార్చి 9వ తేదీ గురువారం నుంచి 11వ తేదీ వరకు తహసీల్దార్ కార్యాలయంలో మూడు రోజుల పాటు సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఇళ్లు లేని చిట్కుల్, ముత్తంగి పేద ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

'తెల్లాపూర్‌లో అవినీతిపై ఉద్యమిస్తా'



మాట్లాడుతున్న కౌన్సిలర్ భరత్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీలో రోజురోజుకూ అవినీతి పెరిగిపోతోందని, దానిపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తానని స్వతంత్ర కౌన్సిలర్ కొల్లారి భరత్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని జ్యోతిరావు పూలే కాలనీ సమీపంలో ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మిస్తున్న ప్రాజెక్టుతో రానున్న రోజుల్లో కాలనీ ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ పాలకవర్గ నిర్లక్ష్యం కారణంగా శేరిలింగంపల్లి పరిధిలోని గోపన్‌పల్లి నుంచి వచ్చే కాల్వను పూర్తిగా దారి మళ్లించారని, కాల్వను సైతం చిన్నగా చేస్తున్నారన్నారు. దీనిపై పలుమార్లు మున్సిపల్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. త్వరలో అధికారులు, ప్రజాప్రతినిధుల ఇళ్ల ముందు ధర్నా చేస్తానని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ తెల్లాపూర్ మున్సిపాలిటీకి ఇచ్చిన రూ.25 కోట్ల నిధులను ఇష్టానుసారంగా కేటాయించారని ఆరోపించారు. మాజీ సర్పంచ్ సోమిరెడ్డి నిర్మించిన భవనం వద్ద మున్సిపాలిటీ నిధులతో రోడ్డు వేయడం బాధాకరమన్నారు. ప్రజల అవసరాల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజావసరాల కోసం కేటాయించిన భూమిలో మున్సిపల్ కార్యాలయాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారని, దాన్ని అడ్డుకొని తీరుతామని తెలిపారు.

ఆగుతూ.. సాగుతూ..

జహీరాబాద్‌లో నిలిచిన దుకాణాల సముదాయం పనులు

- ఆదాయం కోల్పోతున్న రైల్వే శాఖ



జహీరాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న దుకాణాల సముదాయం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలో రైల్వే స్టేషన్ వద్ద చేపడుతున్న వాణిజ్య దుకాణాల సముదాయ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కోట్ల రుపాయలతో చేపడుతున్న పనులు ముందుకుసాగడం లేదు. ఫలితంగా రైల్వే శాఖ ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది. దక్షిణ మధ్య రైల్వే ప్రైవేట్ భాగస్వామ్యంతో జహీరాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో మల్టీ ఫంక్షనల్ షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు పార్క్ నిర్మిస్తోంది.

- రూ.20 కోట్ల నిధులతో చేపడుతున్న ఈ దుకాణాల సముదాయం పనులు ప్రారంభంలో శరవేగంతో కొనసాగాయి. ఆ తర్వాత నత్తనడకన నడుస్తున్నాయి. రెండు సంవత్సరాల నుంచి ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి.
- నిమ్జ్ ప్రాజెక్టు ఏర్పాటుతో జహీరాబాద్ ప్రాంతం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. ఈ సమయంలో రైల్వే స్టేషన్ ప్రాంతంలో బహుళ వాణిజ్య దుకాణాల సముదాయాల పనులు ప్రారంభమయ్యాయి. ఏడు సంవత్సరాల క్రితం ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్‌లో దుకాణాల సముదాయాల జాబితాను చేర్చారు. నిధులు మంజూరైన మూడేళ్లకు పనులు ప్రారంభమయ్యాయి. విశాలమైన స్థలం కూడా అందుబాటులో ఉండటంతో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో రైల్వే శాఖ పనులకు శ్రీకారం చుట్టింది.
- దుకాణ సముదాయ నిర్మాణ బాధ్యతలను ప్రైవేట్ సంస్థకు అప్పగించి 40 సంవత్సరాల పాటు లీజుకు ఇచ్చింది. సదరు సంస్థ అద్దె, లీజు ప్రాతిపదికన ముందుకు వచ్చే వ్యాపారులకు దుకాణాలను కేటాయించాలని నిర్ణయించింది. మల్టీ ఫంక్షనల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో బట్టలు, బంగారం దుకాణాలతో పాటు హోటళ్లకు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.
- ఆదాయం కోసం రైల్వే శాఖ చేపట్టిన దుకాణాల సముదాయం పనులు నత్తనకడకన సాగుతున్నాయి. ఇప్పటివరకు పనులు పూర్తయితే దుకాణాలను అద్దెకు ఇచ్చేందుకు అవకాశం ఉండేది. నిర్మాణ పనులు ఆగిపోవడంతో రైల్వే శాఖ ఆదాయాన్ని కొల్పోవల్సి వస్తోంది. ప్రజా ప్రతినిధులు, సంబంధిత రైల్వే శాఖ అధికారులు స్పందించి ఆగిన దుకాణాల సముదాయం పనులను తిరిగి చేపట్టాలని వ్యాపారులు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

జహీరాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో చేపట్టిన దుకాణాల పనులు ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్లు సాగుతున్నాయి. పనులు అసంపూర్తిగా ఉన్నందున రైల్వే శాఖ ఆదాయం కొల్పోతోంది. ప్రజా ప్రతినిదులు, రైల్వే శాఖ అధికారులు దృష్టి సారించి ఆగిన పనులను తిరిగి ప్రారంభించి దుకాణాలను వినియోగంలోకి తేవాలి.

– సుధీర్ బండారీ, జహీరాబాద్

అధికారుల దృష్టికి తీసుకెళ్తా..



జహీరాబాద్ రైల్వే స్టేషన్ వద్ద చేపడుతున్న కాంప్లెక్స్ నిర్మాణ పనులు ఆగడంతో ఆదాయం దెబ్బతింటున్న మాట వాస్తవమే. పనులు నిలిచిపోవడానికి కారణాలు తెలియదు. అర్ధాంతరంగా ఆగిన దుకాణాల పనుల గురించి దక్షణ మధ్య రైల్వే అధికారులను కలిసి ఫిర్యాదు చేస్తా.

– షేక్ ఫరీద్, రైల్వే బోర్డు సభ్యులు

ఉచితంగా న్యాయ సేవలు

సీనియర్ సివిల్ జడ్జి హన్మంతరావు



జడ్జి హన్మంతరావును సన్మానిస్తున్న దృశ్యం

జోగిపేట(అందోల్): మహిళలు ఎటువంటి కేసులకైనా ఉచితంగా న్యాయ సలహా పొందవచ్చునని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్‌సీ సెక్రెటరీ జె.హన్మంతరావు అన్నారు. అందోలు మండలం నేరేడిగుంటలో మండల లీగల్ సెల్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ చందులత మల్లప్ప అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హన్మంతరావు మాట్లాడుతూ మహిళలకు ఉచితంగా న్యాయ సలహా పొందడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని పేర్కొన్నారు. మహిళలకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని చట్టం చెబుతోందన్నారు. కూలి పనికి వెళ్లినప్పుడు మగ మనిషికి ఇంత, ఆడ మనిషికి ఇంత అంటూ వేర్వేరుగా కూలి చెల్లించకూడదన్నారు. రాజ్యాంగం మహిళలకు ఎన్నో చట్టాలను రూపొందించిందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలంటే చదువు ముఖ్యం అన్నారు. తమకు జరిగిన అన్యాయంపై ఊరుకోకుండా ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం సర్పంచ్ చందులత మాట్లాడుతూ బాలికలు ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలన్నారు. మహిళలకు రిజర్వేషన్లను రాజ్యాంగం కల్పించడం వల్లనే తాను గ్రామ సర్పంచ్ కాగలిగానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం.జగన్మోహన్ రెడ్డి, ఎంపీటీసీ కృష్ణా గౌడ్, మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ న్యాయవాది పీజే విఠల్‌రెడ్డి, గ్రామ పెద్దలు మల్లప్ప, శ్రీధర్ రెడ్డి, పట్లోళ్ల శంకరప్ప, గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యం

అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్



బాలింతకు కేసీఆర్ కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో సకల సౌకర్యాలతో మెరుగైన వైద్యం అందిస్తున్నామని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ తెలిపారు. బుధవారం అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా ఆరోగ్య పథకాన్ని ప్రారంభించారు. అనంతరం రూ. 30 లక్షలతో చేపడుతున్న మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేసి నాణ్యమైన మందులు ఇస్తారనే నమ్మకం ప్రజలకు సీఎం కేసీఆర్ కల్పించారన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం మహిళలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకే మహిళ ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టిందని వివరించారు. ప్రభుత్వం రెండేళ్లకు సంబంధించి మండలంలో పావలా వడ్డీ రుణాలు 340 డ్వాక్రా గ్రూపులకు రూ. 94 లక్షల 90 వేలు విడుదల చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో టెలికాం అడ్వైజరీ కమిటీ జిల్లా సభ్యుడు కాశీనాథ్, సర్పంచ్ అంజయ్య యాదవ్, డాక్టర్ అశ్విని, తహసీల్దార్ తులసిరాం, ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, సీఐ జార్జ్, సర్పంచ్‌లు భేతయ్య, సుభాష్, లక్ష్మయ్య, రంజిత్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తీర్చాలని ధర్నా



ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న కాలనీవాసులు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని నూతన కాలనీ వాసులు కొద్ది రోజులుగా తాగునీరు సరఫరా కావడంలేదని, ఇబ్బందులు తీర్చాలని బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి సమస్యపై అధికారులకు పలుసార్లు విన్నవించినా సమస్య పరిష్కారానికి నోచుకోవడంలేదని ఆరోపించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి గోవింద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిష్కరిస్తామని ఆయన కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

రుణ లక్ష్యాలను చేరుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: బ్యాంకర్లు రుణాల లక్ష్యాన్ని చేరుకోవాలని, వివిధ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు రుణాలను త్వరగా మంజూరు చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ బ్యాంకర్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా సమన్వయ, సంప్రదింపుల కమిటీ(డీసీసీ, డీఎల్ఆర్‌సీ) సమావేశం జరిగింది. వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాల్లో యూనిట్ల గ్రౌండింగ్, లక్ష్యాల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా వివిధ పథకాల్లో అందిస్తున్న యూనిట్లను వేగవంతంగా గ్రౌండింగ్ చేయాలని, 15 రోజుల్లోగా రుణ లక్ష్యాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, బ్యాంకర్లకు ఆదేశించారు. స్వయం ఉపాధి కింద కొత్తగా వ్యాపారం చేయడానికి దరఖాస్తు చేసుకున్న వారిని ప్రోత్సహించాలని బ్యాంకర్లకు సూచించారు. అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేసే లక్ష్యాలను సాధించాలన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటికి సంబంధించిన పురోగతిని ఎల్డీఎం గోపాల్ రెడ్డి వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం పంట రుణాల లక్ష్యం రూ.2,450 కోట్లు కాగా డిసెంబర్ 22 నాటికి రూ.2,070 కోట్ల రుణాలు మంజూరు చేశారని, ఎంఎస్ఎంఈ రుణ లక్ష్యం రూ.950 కోట్లకు గాను లక్ష్యానికి మించి రూ.1,104.87 కోట్లు ఇచ్చారని, డీఆర్డీఏ ద్వారా స్వయం సహాయక సంఘాలకు రూ.840.15 కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్దేశించగా ఇప్పటివరకు రూ.836.38 కోట్ల రుణాలు అందించారని తెలిపారు. మెప్మా రుణ లక్ష్యం రూ.98.34 కోట్లు కాగా, ఇప్పటికే లక్ష్యాన్ని అధిగమించి రూ.100.47 కోట్ల రుణాలను అందించినట్లు వివరించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ గోపాల్ రెడ్డి, ఆర్బీఐ ఏజీఎం ఆలీబాబా, నాబార్డ్ ఏజీఎం కృష్ణతేజ, వివిధ శాఖల జిల్లా అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి పెద్దపీట



మహిళా ఆరోగ్య పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మహిళల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రామచంద్రాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. కార్పొరేటర్లు బూరుగడ్డ పుష్ప నగేశ్, వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు గోవింద్, బూరుగడ్డ నగేశ్, వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, ప్రమోద్ గౌడ్, పరమేష్ యాదవ్, రాణి యాదవ్ పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం



ఝరాసంగంలో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్ రావు

ఝరాసంగం(జహీరాబాద్): మహిళల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. ఝరాసంగం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆరోగ్య మహిళా - ఆరోగ్యం ఇంటికి సౌభాగ్యం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య మహిళా పథకంలో 8 రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రి దేవి, సర్పంచ్ జగదీశ్వర్, ఎంపీటీసీ సభ్యురాలు రచన ప్రియ సంతోష్ కుమార్ పాటిల్, వైద్యాధికారి డాక్టర్ రమ్య, మండల కార్యదర్శి నర్సింలు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తేనే సార్థకత

ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు సంధ్య



మాట్లాడుతున్న సంధ్య

కొండాపూర్(సంగారెడ్డి): మహిళలు సామాజికంగా, కుటుంబపరంగా, మానసికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తేనే మహిళా దినోత్సవానికి సార్థకత ఉంటుందని ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు సంధ్య అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం సంగారెడ్డిలోని ఎల్లంకి డిగ్రీ కళాశాలలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దశాబ్దాల పోరాటాల ఫలితంగానే మహిళలకు హక్కులు దక్కాయని పేర్కొన్నారు. ×రాజ్యాంగం – మహిళా హక్కులు¶ అనే అంశంపై మాట్లాడుతూ భారత రాజ్యాంగం సంక్షోభంలో పడిందన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా మహిళలకు వివక్ష నుంచి విముక్తి లభించడం లేదన్నారు. మరో వక్త తోట అపర్ణ ×మహిళలు మానసిక ఆరోగ్యం – ఆత్మహత్యలు¶ అనే అంశంపై ప్రసంగిస్తూ ఇటీవల మహిళల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల ఆలోచనలు సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొని నిలబడేలా ఉండాలన్నారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్ లక్ష్మయ్య యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు నాసర్‌పటేల్, విజయ్‌భాస్కర్, జిల్లా కార్యదర్శులు అశోక్ కుమార్, మల్లికార్జున్, పుండరీకం, సాంబశివుడు, బిచ్చయ్య, గీతామాలిని, చంద్రకళ, తార, సూర్యకళ, సత్యవాణి, జ్యోతి, శ్వేత, వసంత, భువనేశ్వరి, సింధు, నందిని, విద్యావతి, అనిత, మిరియాల జ్యోతి, పద్మావతి, హేమలత, రాణి, సంతోషమ్మ, మంజుల, గోదావరి, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

సమాన అవకాశాలు కల్పించాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి



మాట్లాడుతున్న జ్ఞానమంజరి

కొండాపూర్(సంగారెడ్డి): దేశాభివృద్ధికి మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా ×డిజిటల్ టెక్నాలజీ రంగంలో మహిళల సమానత్వం¶ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జ్ఞాన మంజరి, అడ్వకేట్ లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు రమ్య పలు అంశాలపై మాట్లాడారు. వివక్షను ఆపడానికి ప్రభుత్వం మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని, పని ప్రదేశాల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యాసంస్థల్లో మహిళలపై జరుగుతున్న వివక్షతను అరికట్టడానికి టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, కోశాధికారి, శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు అమరేశ్వరి, అనురాధ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి

మహిళల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాణిక్యం, బాలల పరిరక్షణ సమితి(బీపీఎస్) వ్యవస్థాపక అధ్యక్షురాలు శృతి గౌడ్ మాట్లాడుతూ మహిళల 33 శాతం రిజర్వేషన్ బిల్లు కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకురాలు లక్ష్మి, టీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్, నాయకులు ప్రవీణ్, దాస్, శతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలను పరిష్కరించాలి

కలెక్టర్ డాక్టర్ శరత్



సమావేశంలో కలెక్టర్, జిల్లా అధికారులు

సంగారెడ్డి టౌన్: ధరణిలో వివిధ మాడ్యూల్స్‌లో వచ్చిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లతో సమావేశమయ్యారు. ధరణి ఫైల్స్ పరిష్కారం, భూసేకరణ, భూ సమీకరణ పురోగతి, జీఓ నం.59, తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీఓ – 59 కింద లబ్ధిదారులు నిబంధనల మేరకు చెల్లించాల్సిన పూర్తి మొత్తాన్ని చెల్లించేలా చర్యలు చేపట్టాలని, పూర్తి మొత్తాన్ని చెల్లించిన వెంటనే ఇంటి స్థల రిజిస్ట్రేషన్ చేయించి దస్తావేజులు అందించాలన్నారు. ఈ జీఓ కింద 471మంది లబ్ధిదారులకు గాను పూర్తి మొత్తం చెల్లించిన 212 మందికి దస్తావేజులు అందించినట్లు తెలిపారు. పాక్షికంగా చెల్లించిన వారందరూ పూర్తిగా చెల్లించి దస్తావేజులు పొందేలా చూడాలన్నారు. వివిధ అభివృద్ధి పనులకు కావాల్సిన భూసేకరణను, భూ సమీకరణను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. గతంలో ఇళ్ల కోసం భూమి సేకరించి కేటాయించకుండా ఉన్న భూ వివరాలను అందించాలని తహసీల్దార్లకు ఆదేశించారు. అనంతరం రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఉద్యోగినులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, కలెక్టరేట్ ఏఓ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సంగారెడ్డి మున్సిపాలిటీ: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. సంగారెడ్డి టౌన్ సీఐ శ్రీధర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి శివారులోని మహబూబ్ సాగర్ చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వయస్సు 50 ఏళ్ల లోపు ఉంటుందని పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసినవారు 08455 276333 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని సీఐ కోరారు.

వ్యక్తి అదృశ్యం



కరీం ఉల్లాఖాన్ (ఫైల్)

సంగారెడ్డి టౌన్: సమోసా వ్యాపారి రెండురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండాపోయాడు. బుధవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి మండలం పసల్వాది గ్రామ పంచాయతీ డబుల్ బెడ్ రూమ్ కాలనీకి చెందిన కరీం ఉల్లాఖాన్ (40) వృత్తి రీత్యా సమోసా వ్యాపారి. సమోసాలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండు రోజులు కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు తెలిసినవారిని, బంధువులను విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో భార్య అజ్మీరి బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కరీం ఉల్లాఖాన్ ఆచూకీ తెలిసినవారు 87126 56746 నంబర్‌కు ఫోన్‌చేసి వివరాలు తెలిపాలన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

సిద్దిపేటరూరల్: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కిరణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన మొలుగు మొగ్గయ్య(45) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ పోషణకోసం అప్పులు చేశాడు. అవి ఎలా తీర్చాలో తెలియక సతమతమై ఫిబ్రవరి 8వ తేదీన పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పంట పొలాల సందర్శన

నిజాంపేట(మెదక్): రైతులు సాగుచేస్తున్న పంట పొలాలను వ్యవసాయ అధికారులు సందర్శిస్తున్నారు. బుధవారం మండల పరిధిలోని వెంకటాపూర్(కె) రైతులు సాగుచేస్తున్న పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి సతీశ్ సందర్శించారు. వరిలో అగ్గి తెగులు ఉధృతి అధికంగా ఉందని, నివారణకు ట్రైసైక్లోజోల్120 గ్రా లేదా ఐసోప్రోథయోలిన్ 350 మిల్లీ లీటర్లు పిచికారీ చేయాలన్నారు. యూరియా మోతాదు తగ్గిస్తే ఈ తెగులు ఉధృతి తగ్గించవచ్చన్నారు. వరి పంట చిరుపొట్ట దశలో ఉందని, మొగిపురుగు వచ్చే అవకాశం ఉందన్నారు.

ఘనంగా బండ్ల ఊరేగింపు



బండ్ల ఊరేగింపులో ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి

మెదక్ రూరల్: మెదక్ మండలం రాయిన్‌పల్లి గ్రామంలో వెంకటేశ్వర స్వామి బండ్ల ఊరేగింపు కార్యక్రమం జరిగింది. బుధవారం సీఎం కేసీఆర్ రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి హాజరయ్యారు. ఆయనకు సర్పంచ్ అంజగౌడ్, ఎంపీటీసీ శ్రీహరి, ఉపసర్పంచ్, గ్రామ పంచాయతీ పాలకమండలి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్దాగౌడ్, ఎంపీటీసీ శ్రీహరి, ఉప సర్పంచ్ రమేశ్, పాతూర్ సర్పంచ్ బాలయ్య, హవేలి ఘనపూర్ మండల సర్పంచ్ లు మహిపాల్ రెడ్డి, యామిరెడ్డి, దేవాగౌడ్, శ్రీను నాయక్, ఎంపీటీసీ లు సిద్దిరెడ్డి తదితరులు ఉన్నారు.

కిడ్నీ బాధితులకు ఊరట

- సిద్దిపేట జిల్లాలో నాలుగు డయాలసిస్ కేంద్రాలు
- ఉచితంగా డయాలసిస్ సేవలు
- నిత్యం 200 మందికి డయాలసిస్
- నేడు వరల్డ్ కిడ్నీ డే



సిద్దిపేట డయాలసిస్ సెంటర్‌లో డయాలసిస్ సేవలు పొందుతున్న కిడ్నీ రోగులు

సిద్దిపేటకమాన్: కిడ్నీ వ్యాధి బారినపడిన రోగుల పరిస్థితి వర్ణనాతీతం, అది డయాలసిస్ స్టేజీకి వస్తే మరీ కష్టం. రోగి మానసికంగా, శారీరకంగా, ఆర్థికం ఇబ్బందులు పడుతుంటాడు. చికిత్స చేయించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే ముప్పు. చికిత్స ఖర్చు వేలల్లో ఉంటుంది. అటువంటి వారికి ఊరట కలిగించేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చొరవతో సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పత్రి, గజ్వేల్ ఏరియా ఆస్పత్రి, హుస్నాబాద్, దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తుండటంతో కిడ్నీ వ్యాధి గ్రస్తులు కొంత ఉపశమనం పొందుతున్నారు. గతంలో హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, కామారెడ్డికి వెళ్లి డయాలసిస్ చేయించుకునేవారు. వారి బాధలను స్వయంగా చూసిన మంత్రి 2017లో సిద్దిపేటలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

105 మందికి డయాలసిస్ సేవలు

- సిద్దిపేట డయాసిస్ కేంద్రాన్ని 2017 ఆగస్టులో ఐదు పడకలతో డయాలసిస్ సేవలను ప్రారంభించారు. రోగులు ఎక్కువగా ఉండటంతో 2018 ఆగస్టులో మరో ఐదు యూనిట్లను పెంచారు.
- రోజుకు ఐదు షిఫ్టుల్లో 105 మంది కిడ్నీ బాధితులకు డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. ఇప్పటివరకు 59,404 సెషన్ల డయాలసిస్ సేవలను అందించినట్లు సెంటర్ నిర్వాహకులు చెబుతున్నారు. ఈ కేంద్రంలో మొత్తం 12 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.
- గజ్వేల్ ఏరియా ఆస్పత్రిలో ఎనిమిది బెడ్స్‌తో నాలుగు షిఫ్టుల్లో రోజుకు 28 మందికి చొప్పున 70 మంది కిడ్నీ రోగులు డయాలసిస్ సేవలు పొందుతున్నారు.
- హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఐదు బెడ్స్‌తో 25 మందికి డయాలసిస్ సేవలు అందిస్తున్నారు.
- దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చి 5వ తేదీన మంత్రి డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే.
- ఇలా జిల్లాలో నాలుగు సెంటర్లలో 200 మంది కిడ్నీ రోగులు వైద్య సేవలు పొందుతున్నారు.



రోగులకు బయోమెట్రిక్ చేస్తున్న సిబ్బంది

సౌకర్యంగా ఉంది



నాలుగు ఏళ్ల నుంచి కిడ్నీ సమస్యతో బాధపడుతున్నా. గతంలో చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి వెళ్లి డయాలసిస్ చేయించుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డాను. ప్రయాణ ఖర్చులు ఎక్కువయ్యేవి. కానీ, సిద్దిపేటలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుతో ప్రయాణ ఖర్చులు తగ్గాయి. సౌకర్యంగా ఉంది. ఇక్కడ ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా చికిత్స చేయించుకొని వెళ్తున్నా.

–కనకవ్వ, దుద్దెడ

ప్రయాణ ఖర్చులకే..



డయాలసిస్ కోసం గతంలో కామారెడ్డి వెళ్ళేవాడిని. అక్కడికి వెళ్లి చికిత్స చేయించుకోవడానికి ప్రతిసారి ప్రయాణ ఖర్చులు, వైద్య ఖర్చులు మొత్తం రూ.8 నుంచి రూ.10 వేలు ఖర్చయ్యేవి. కానీ, సిద్దిపేటలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు అనంతరం ఇబ్బందులు తగ్గాయి. ప్రస్తుతం వారానికి రెండు సార్లు డయాలసిస్ చేయించుకునేందుకు వస్తున్నాను. ఇటీవల దుబ్బాకలో డయాలసిస్ సెంటర్ ప్రారంభించడం మాకు ఉపయోగపడుతుంది. మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు.

–ఉదయభాను, చిట్టాపూర్

ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు

సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పత్రిలో కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందిస్తున్నాం. సిద్దిపేట డయాలసిస్ కేంద్రంలో 105 మంది కిడ్నీ రోగులు డయాలసిస్ సేవలు పొందుతున్నారు. నిత్యం ఐదు షిఫ్టుల్లో, 40 నుండి 45 షెషన్స్‌తో డయాలసిస్ చేస్తున్నాం. గతంలో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి రోగులు ఆర్థికంగా ఇబ్బందిపడేవారు. మంత్రి హరీశ్‌రావు చొరవతో సిద్దిపేటలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రంలో కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ కిషోర్‌కుమార్, సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

సాగు, తాగు నీరు రూపంలో కేసీఆర్



భూమి పత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

- పనిచేసే ప్రభుత్వాన్ని దీవించండి
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: పొలం వాకిట్లోకి వచ్చిన సాగునీరు.. పొయ్యి కాడికి వచ్చిన తాగునీళ్లలో సీఎం కేసీఆర్ కనబడుతున్నాడని, నియత్ ఉంటే బర్కత్ ఉంటుందని, మీరు దీవిస్తే మేము ఇంకా ఎక్కువగా, గట్టిగా పనిచేస్తామని, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని దీవించాలని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్, వెంకటాపూర్, నారాయణరావు పేట మండలం గుర్రాలగొంది, నంగనూర్ మండలం గట్లమల్యాల గ్రామాల్లో 169 రైతులకు పట్టా ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యాలయాల చుట్టూ తిరిగినా జరగని పనిని, మీ గ్రామంలో రెవెన్యూ సదస్సులు పెట్టి పరిష్కారం చేసి, క్యాంపు కార్యాలయానికి పిలిపించి భోజనం పెట్టి హక్కు పత్రాలను ఇస్తున్నామన్నారు. భూ హక్కు లేక, పట్టాదారు పుస్తకం లేక రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, సంక్షేమ పథకాలు అందక నానా అవస్థలు పడ్డారని గుర్తుచేశారు. అర్హులైన వారందరికి కలెక్టర్‌తో మాట్లాడి పట్టాలు మంజూరు చేసినట్లు చెప్పారు. అనంతరం తంజీమ్ కోరిక మేరకు మైనార్టీల అభివృద్ధికి రూ.15 లక్షల నిధులు విడుదల చేశారు. జిల్లాలోని మైనార్టీ సంక్షేమ గురుకుల వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. విద్యుత్ శాఖలో చేసిన సేవలకు గుర్తింపుగా ఢిల్లీలో లైన్‌మెన్ దినోత్సవం సందర్భంగా సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ద్వారా ఉత్తమ అవార్డు పొందిన ఈశ్వర్‌రెడ్డిని మంత్రి అభినందించి అవార్డ్ అందచేశారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజనర్స్, నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు సాయిరాం, కౌన్సిలర్లు మొహిజ్, రియాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొహిజ్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు

సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీపీ శ్వేత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో ఏ రకమైన సైబర్ నేరాలు జరుగుతున్నాయో మీడియా ద్వారా తెలియజేస్తామన్నారు. సైబర్ నేరగాళ్లు తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించవచ్చనే ఆశ చూపించి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వ్యక్తిగత సమాచారం సోషల్ మీడియాలో పంచుకోకూడదని, ఫోన్లు వినియోగించేటపుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. బుధవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన సైబర్ నేరాల వివరాలు తెలిపారు. సిద్దిపేటలోని ఓ వ్యక్తికి ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని నమ్మబలికాడు. పాన్ కార్డును బ్యాంక్ ఖాతాకు అనుసంధానం చేయాలని లేదంటే అకౌంట్ క్లోజ్ అవుతుందన్నాడు. తాను ఓ ఫైల్ పంపుతున్నానని అది ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. అపరిచితుడు పంపిన ఏపీకే ఫైల్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని, తన ఫోన్‌కు వచ్చిన ఓటీపీ వివరాలు తెలిపిన వెంటనే ఖాతా నుంచి రూ.51,565 డెబిట్ అయ్యాయి. బాధితుడు 1930కు ఫిర్యాదు చేయగా రూ.41వేలు ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు.

అట్రాసిటీ ఫిర్యాదుపై విచారణ



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ యాదగిరిరెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్ గ్రామంలోని పెట్రోల్ పంప్ యజమాని ఫిర్యాదుపై తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. తనను ఖాజాపూర్ గ్రామానికి చెందిన చిగుల్ల శ్యామయ్య ఈనెల 6వ తేదీన కులం పేరుతో దూషించాడని మంగళవారం ఖాజాపూర్ పెట్రోల్ పంప్ యజమాని ఎరుకల యాదయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెట్రోల్ పంప్ పక్కన ఉన్న యాదయ్యకు చెందిన దాబా వద్ద పార్కింగ్ చేసిన లారీలను తీసుకెళ్లాలని శ్యామయ్య లారీ యజమానులను గట్టిగా హెచ్చరించాడు. ఈ క్రమంలో యాదయ్య పెట్రోల్ పంప్‌లో శ్యామయ్య రూ.వందకు పెట్రోల్ పోయించికుని డబ్బులు ఇవ్వలేదు. డబ్బులు ఇవ్వమని అడిగితే దుర్భాషలాడాడు. దీంతో యాదయ్య కులం పేరుతో దూషించాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు చిన్నశంకరంపేట ఎస్ఐ సుభాశ్‌గౌడ్ కేసు నమోదు చేశారు. ఈ విషయంపై తూప్రాన్ డీఎస్పీ ఫిర్యాదుదారుడి నుంచి వివరాలు సేకరించారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పటాన్‌చెరు టౌన్: ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు హెచ్చరించారు. బుధవారం పటాన్‌చెరు బస్టాండ్ సమీపంలో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. వాహనదారులు డ్రంకెన్ డ్రైవ్, సెల్‌ఫోన్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయకూడదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనాన్ని సీజ్ చేసి నడిపిన వ్యక్తిని సంగారెడ్డి కోర్టుకు పంపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, ద్విచక్రవాహన దారులు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

అల్లాదుర్గం(మెదక్): విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. ఈ సంఘటన బుధవారం ఉదయం మండల పరిధిలోని గొల్లకుంట తండాలో చోటు చేసుకుంది. బాధితుడు పుణ్యానాయక్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. చేలో మేతకు వెళ్లిన ఎద్దు విద్యుత్ స్తంభాన్ని తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.60 వేలు ఉంటుందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు. కాగా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

లైంగిక వేధింపులపై విచారణ

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయురాలి లైంగిక వేధింపుల విషయంపై అధికారులు చర్యలు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సూరారం జెడ్పీపాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం యాదగిరి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆమె ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఈవిషయంపై విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఫిర్యాదుతో ఫిబ్రవరి 22వ తేదీన చిన్నశంకరంపేట పోలీసులు కేసునమోదు చేశారు. అప్పటి నుంచి హెచ్‌ఎం యాదగిరి మరో ఉపాధ్యాయుడికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి సెలవుపై వెళ్లాడు. అయితే ఇప్పటి వరకు చర్యలు చేపట్టలేదు. బుధవారం కలెక్టర్ రాజర్షిషా ఆదేశాలతో డీఈఓ చంద్రశేఖర్, ఎంఈఓ యాదగిరి పాఠశాలకు వెళ్లి విచారణ నిర్వహించారు. సెలవులో ఉన్న యాదగిరి తనపై ఫిర్యాదు చేసిన విషయం మండల, జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వకుండా గోప్యత పాటించడం, ఎఫ్ఐఆర్ నమోదైనా విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఎట్టకేలకు పోలీస్‌ల ఎఫ్ఐఆర్ కాపీతోపాటు విచారణ నివేదికను చిన్నశంకరంపేట ఎంఈఓ జిల్లా విద్యాశాఖ అధికారులకు అందజేశారు.

మద్యం మత్తులో యువకుల ఘర్షణ

- వారిని అడ్డుకునేందుకు యత్నించిన బంధువు
- గుండెపై బలంగా కొట్టడంతో కుప్పకూలి మృతి



జంగిలి సుధాకర్ (ఫైల్)

సదాశివపేట(సంగారెడ్డి): హోలీ వేడుకల్లో అప్పటి వరకు ముగ్గురు యువకులు కేరింతలు కొట్టారు. మద్యం మత్తులో ఒకరినొకరు దూషించుకోవడంతో కొట్టుకుంటున్నారు. వారి గొడవను అడ్డుకునేందుకు వెళ్లిన వ్యక్తిపై ఇద్దరు ఛాతిపై కొట్టడం మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శివపురి కాలనీకి చెందిన భాగ్యరాజు, కుమార్, కిషోర్ మద్యం మత్తులో గొడవపడుతున్నారు. వారిని అడ్డుకుని తన సోదరుడి కూమారుడు భాగ్యరాజ్‌ను విడిపించేందుకు మృతుడు సుధాకర్ ప్రయత్నించారు. అయితే కుమార్, శేఖర్ అతడి గుండెపై బలంగా కొట్టడంతో అక్కడే కుప్పకూలి పోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అప్పుల బాధతో ఒకరు.. మద్యం తాగొద్దన్నందుకు మరొకరు

అప్పుల విషయంలో భార్యభర్తలు గొడవపడ్డారు. దీంతో మనస్తాపం చెందిన భర్త పొలంలో ఉరివేసుకున్నాడు. అలాగే భార్య మద్యం తాగొద్దని భర్తను అడ్డుకోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



సిద్దుకుమార్ మృతదేహం

సిద్దిపేటకమాన్: మద్యం తాగొద్దని భార్య అడ్డుచెప్పినందుకు భర్త బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సిద్దిపేట టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణం దోబిగల్లికి చెందిన భూంపల్లి సిద్దుకుమార్ (32) మున్సిపాలిటీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం సిద్దుకుమార్ తాగి ఇంటికి వచ్చి భోజనం వడ్డించమని భార్య కల్యాణిని అడగగా ఆమె అన్నం వడ్డించింది. కొంచెం తిన్న తర్వాత మద్యం తాగి వస్తానని చెప్పి బయటకు వెళ్తుండగా భార్య అడ్డుకుంది. దీంతో తనను మద్యం తాగొద్దంటున్నావని, చనిపోతానంటూ వెళ్లిపోయాడు. దీంతో కంగారు పడిన కల్యాణి, బంధువులతో కలిసి చుట్టుపక్కల వెతకగా కనిపించలేదు. ఈక్రమంలో మేకల కాపరి భోగేశ్వరాలయంవైపు ఓ వ్యక్తి పరిగెత్తడం చూశానని చెప్పడంతో వారు చుట్టుపక్కల వెతకగా ఓ బావిలో సిద్దుకుమార్ పడిఉండడాన్ని గమనించారు. అతడిని బయటకు తీయగా అప్పటికే మృతిచెందాడు. భార్య కల్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొండాపూర్(సంగారెడ్డి): అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలోని గొల్లపల్లిలో చోటు చేసుకుంది. బుధవారం కొండాపూర్ ఎస్ఐ వెంకటేశం కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన రాజు (35) వ్యవసాయం చేస్తున్నాడు. అప్పు చేసి కొత్తగా ఇల్లు నిర్మించడమే కాకుండా, కొత్త ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. అప్పుల విషయంపై భార్యభర్తలు గొడవపడ్డారు. దీంతో మనస్తాపం చెందిన రాజు మందాపూర్ శివారులోగల తన పొలంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య రాయెల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

హత్యకేసులో మరొకరికి రిమాండ్

ములుగు(గజ్వేల్): కొండపోచమ్మ సాగర్ వద్ద ఈనెల 24వ తేదీన జరిగిన హత్యకేసులో పరారీలో ఉన్న మరో నిందితుడు బూర్ల ఈశ్వర్‌రావును బుధవారం అరెస్టు చేయగా, గజ్వేల్ కోర్టు రిమాండ్ విధించినట్లు గజ్వేల్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ములుగు పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన చాకలి మధు హత్య కేసులో ఈనెల 3న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. కాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం పీరువాడ గ్రామానికి చెందిన బూర్ల ఈశ్వర్‌రావు పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇస్నాపూర్‌లో అతడిని అరెస్టు చేసి, అతడి వద్ద ఉన్న సుపారీ డబ్బు రూ.15 వేలు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

హోలీ సంబరాల్లో విషాదం

- రంగులు చల్లుకుంటూ నందడి చేసిన యువకులు
- స్నానం చేసేందుకు కుంటలకు వెళ్లి గల్లంతు
- గజ ఈతగాళ్లతో గాలిస్తున్న పోలీసులు



గండిగూడెం గ్రామ చెరువులో గాలిస్తున్న దృశ్యం

హోలీ పండగలో యువకులు సందడి చేశారు. ఉత్సాహంగా రంగులు చల్లుకున్నారు. ఒంటికి అంటిన రంగులు నీళ్లతో శుభ్రం చేసుకునేందుకు కుంటల్లో స్నానం చేసేందుకు దిగి గల్లంతయ్యారు. వారికోసం పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టారు. ఇప్పటి వరకు వారి ఆచూకీ లభించకపోవడంతో యువకుల కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): హోలీ సంబరాలు జరుపుకొని స్నానం చేసేందుకు వెళ్లిన యువకులు గల్లంతయ్యారు. బొల్లారం పీఎస్ పరిధిలో ఓ యువకుడు గల్లంతైనట్లు సీఐ సురేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్ కొండాపూర్‌లో నివాసం ఉంటున్న నీలం సాయికిరణ్(17) బొల్లారం పీఎస్ పరిధిలోని గండిగూడెం గ్రామంలోగల అమ్మమ్మ ఇంటికి హోలీ పండుగ కోసం వచ్చాడు. స్నేహితులతో హోలీ ఆడాడు. స్నానం చేసేందుకు ఖాజీపల్లి ప్రాంతంలోని క్వారీలోని కుంటకు వెళ్లారు. స్నానం చేసేందుకు కుంటలోకి దిగిన సాయికిరణ్ బయటకు రాలేదు. తోటి స్నేహితులు సాయికిరణ్ అమ్మ సత్యవతికి సమాచారాన్ని ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అతడి కోసం కుంటలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నామని సీఐ తెలిపారు.

గడ్డపోతారంలో..

మధ్యప్రదేశ్‌కు చెందిన సోనూసింగ్(36) గడ్డపోతారంలోని ఓ పరిశ్రమల్లో పనిచేస్తున్నాడు. బుధవారం రంగుల పండుగ సందర్భంగా తన స్నేహితులతో కలిసి హోలీ ఆడాడు. అనంతరం సమీపంలోని అయ్యమ్మ చెరువులో స్నానం చేసేందుకు దిగి గల్లంతయ్యాడు. ఇప్పటి వరక అతడి ఆచూకీ లభించలేదు. పోలీసులు గజ ఈతగాళ్లతో గాలిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నామని సీఐ వెల్లడించారు.

హోలీ ఆడిన తర్వాత..



మేదరి అశోక్ (ఫైల్)

నారాయణఖేడ్: హోలీ ఆడిన తర్వాత ఒంటికి అంటిన రంగులను శుభ్రం చేసుకునేందుకు కుంటలోకి దిగిన యువకుడు గల్లంతయ్యాడు. ఈ సంఘటన బుధవారం జరిగింది. ఖేడ్ మండలం తుర్కాపల్లి గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుర్కాపల్లి గ్రామానికి చెందిన మేదరి సంగన్న, అంజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కుమారుడు మేదరి అశోక్(30)కు వివాహం జరిగింది. మనస్పర్థల కారణంగా భార్య పుట్టింట్లో ఉంటోంది. మంగళవారం గ్రామంలోని యువకుడు హోలీ వేడుకలు జరుపుకున్నారు. రాత్రయినా అశోక్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా గ్రామ శివారులోని పెద్దమ్మకుంట ఒడ్డున అశోక్ దుస్తులు కనిపించాయి. స్నానం కోసం కుంటలో దిగి గల్లంతయ్యాడని భావిస్తున్నారు. సర్పంచ్ స్రవంతి పరమేశ్ పర్యవేక్షణలో కుంటలో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదు.

మనవడికి ఈత నేర్పించడానికి వెళ్లి..

నీట మునిగి తాత, మనవడు మృతి



వెంకటయ్య (ఫైల్)



జస్వంత్ (ఫైల్)

ములుగు(గజ్వేల్): కొండపోచమ్మసాగర్ కాలువ కింద ఉన్న కుడిగుంట్ల వాగు గుంతలో మనవడికి ఈత నేరిస్తూ ప్రమాదవశాత్తు నీట మునిగి తాత.. ఇద్దరూ మృతి చెందారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం అడవిమజీద్‌లో జరిగిన ఈ సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ములుగు ఎస్ఐ రంగాకృష్ణ తెలిపిన వివరాలివి. అడవిమజీద్ గ్రామానికి చెందిన పిట్టల వెంకటయ్య (60), మనవడు పిట్టల జస్వంత్ (12) ఇద్దరూ పొలం వద్దకు వెళ్లి వస్తామని ఇంట్లో చెప్పి మంగళవారం టీవీఎస్ మోపెడ్‌పై వెళ్లారు. ఇద్దరూ రాత్రి 7 గంటలైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు వారికోసం గాలించారు. రాత్రివేళ గ్రామ సమీపంలోని కొండపోచమ్మ సాగర్ కాలువ గట్టుపై మృతుడు వెంకటయ్య టీవీఎస్ మోపెడ్‌తో పాటు దుస్తులు గుర్తించారు. వెంటనే సాగర్ కాలువ కింద ఉన్న కుడిగుంట్ల వాగు గుంతలో వెతకగా వెంకటయ్య, జస్వంత్ మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ మేరకు బుధవారం కేసు నమోదు చేసి మృతదేహాలకు గజ్వేల్ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.